

అరాచకాలపై కఠిన చట్టాలు తీసుకురావాలి

వైద్యులపై జరుగుతున్న దాడుల్ని అరికట్టేందుకు జాతీయ స్థాయిలో కఠిన చట్టాలు తీసురావాలి. ప్రత్యేక లా, టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. దోషులకు తక్షణమే శిక్షలు పడేలా చూడాలి. ఎప్పటి నుంచో వైద్యులపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. మహిళా వైద్యులకు భద్రత లేదు. అదీ రాత్రి వేళ్లలో పనిచేసే మహిళా వైద్యులకు భద్రతను పెంచాలి. తల్లిదండ్రులు కూడా మహిళల రక్షణపై పిల్లలకు తగిన శిక్షణ ఇవ్వాలి. గల్ఫ్ దేశాల్లో మాదిరిగా మహిళలపై లైంగిక దాడులు చేసిన వారికి కఠిన శిక్షలు త్వరితగతిన విధించే ఇక్కడ చట్టాలు తేవాలి.

– డాక్టర్ పద్మావతి, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, కాకినాడ





దేశ సంస్కృతిపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి

మగ పిల్లలకు వారి చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు మన దేశ సంస్కృతిపై అవగాహన కల్పిస్తే, మహిళలపై లైంగిక దాడులు గణనీయంగా తగ్గిపోతాయి. వైద్యులు, వైద్య సిబ్బందికి నూరు శాతం రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం దుర్మార్గపు చర్య. ఇలాంటివి జరగకుండా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. మహిళా వైద్యుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ అన్నపూర్ణా యేరూష, దంత వైద్యురాలు, కాకినాడ

క్లుప్తంగా

ఐటీఐ సీట్లకు రేపు మూడో విడత కౌన్సెలింగ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు అడ్మిషన్ల కన్వీనర్ వేణుగోపాలవర్మ మంగళవారం ఇక్కడ తెలిపారు. తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు, తల్లి లేదా తండ్రి, సంరక్షకులతో ఉదయం 9 గంటలకు కళాశాలకు హాజరు కావాలని సూచించారు. ప్రైవేట్ కళాశాలలకు దరఖాస్తు చేసుకున్న వారు 31వ తేదీన హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 97012 15511 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ప్రాణాంతక వైరస్‌లతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కాకినాడ రూరల్: వర్షాకాలంలో ప్రాణాంతక వైరస్‌లతో అప్రమత్తంగా ఉండాలని పీఎంపీ వైద్యుడు కుమార్ యాదవ్ అన్నారు. స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పలువురికి బీపీ పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాలు పెరగడంతో బ్యాక్టీరియా, వైరస్‌లు విజృంభించి, జలుబు, దగ్గు, గొంతు కఫం, వైరల్ ఫీవర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. కాచి చల్లారిన నీటిని తాగడంతో పాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ఇంట్లోకి దోమలు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు అడబాల రత్నప్రసాద్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సుబ్బారావు, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల సమావేశం

కరప: పార్టీ సభ్యత్వ నమోదుపై బీజేపీ మండల శాఖ సమావేశం నడకుదురులో మంగళవారం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి అనపర్తి వెంకటేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటి నుంచి పార్టీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు వివరించారు. అక్టోబర్ ఒకటి నుంచి క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేస్తారన్నారు. పార్టీ నాయకులు కె.భీమశేఖర్, పి.పాలవతి. చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్కడి ప్రభుత్వ తీరు దారుణం

బోట్‌క్లబ్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దుశ్చర్యలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దారుణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ అక్కడి సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ర్యాలీకి అక్కడి ప్రభుత్వం అనుమతించకపోవడం, ర్యాలీ చేస్తున్న ఆందోళనకారులపై దౌర్జన్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. సమావేశంలో బీజేపీ నాయకుడు దువ్వూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మేవా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన మేవా నూతన కార్యవర్గం

కాకినాడ: ముస్లిం ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్(మేవా) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ప్రముఖ న్యాయవాది ఎండీ జవహర్ ఆలీ, కార్యదర్శిగా సయ్యద్ సాలార్, కోశాధికారిగా షేక్ చిష్టీ, సహాయ కార్యదర్శిగా అజహర్, ఉపాధ్యక్షుడిగా గౌస్ మొహిద్దీన్‌ను ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎస్.ఇజాజుద్దీన్‌తో పాటు, షౌకత్ ఆలీ, ఇంతియాజ్, ఎస్కే దుర్రానీ, షేక్ సోహెల్, అహ్మద్ వలీ, బీన్, నజీరుద్దీన్, జఫ్రుల్లా వ్యవహరించారు.

రక్షణ కల్పించాలి

కాకినాడ రూరల్: ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి నుంచి తనకు రక్షణ కల్పించాలని వాకలపూడి గ్రామానికి చెందిన గీసాల వెంకటేశ్వరరావు కోరారు. రమణయ్యపేటలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,, ఈ నెల 23న రాత్రి తనకు ఫోన్ వచ్చిందని, పోలీసులమంటూ బెదిరించారని చెప్పారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా, ఆ నంబరు పోలీసులది కాదని తెలిసిందన్నారు. దీనిపై విచారణ జరపాల్సిందిగా ఆయన కోరారు.

పంచారామ క్షేత్రంలో రేపు వేద పరిషత్

సామర్లకోట: ఏటా నిర్వహిస్తున్న వేద పరిషత్ కార్యక్రమంలో భాగంగా గురువారం పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో 26వ వేద పరిషత్ నిర్వహిస్తున్నట్టు పరిషత్ కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పూర్వ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని వేద పండితులతో వేద సభ నిర్వహించి, వారిని సత్కరిస్తామన్నారు. లోక కల్యాణార్థం హిందూ సంస్కృతీ, సంప్రదాయానుసారం చతుర్వేద పారాయణ, వేద స్వస్థి జరుగుతుందని చెప్పారు.

బెస్ట్‌గా ల్యాబ్ టెస్ట్



ట్రెడ్‌మిల్ ఎక్విప్‌మెంట్ పరికరం

- నామమాత్ర రుసుముతో ఈసీజీ, ఎక్స్‌రే సహా 30 రకాల మెడికల్ టెస్టులు
- రూ.4.50 కోట్లతో ఏర్పాటైన క్లినికల్ ల్యాబ్
- డాక్టర్ బాదం బాలకృష్ణ సేవలు అమోఘం

బాలాజీచెరువు: ప్రస్తుత తరుణంలో ఆస్పత్రులకు వెళితే జేబులకు చిల్లులు పడక తప్పని పరిస్థితి. తుమ్మొచ్చినా, తలనొప్పి వచ్చినా.. ఆ టెస్టులు, ఈ టెస్టులంటూ చేతి చమురు వదిలిస్తారు ఆస్పత్రుల నిర్వాహకులు. ఇటువంటి పరిస్థితుల్లో సేవా దృక్పథంతో ఆవిర్భవించిన డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ అందిస్తున్న సేవలు ప్రతి ఒక్కరి మన్ననలు అందుకుంటోంది.



డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్

సీజనల్ వ్యాధుల కాలం ప్రారంభమైంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ ఏమాత్రం శరీరంలో నలతగా ఉన్నా వెంటనే ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వైద్యశాలకు వెళ్లడమే తరువాయి, అక్కడ రెండు, మూడు రకాల వైద్య పరీక్షలు రాసి, ల్యాబ్‌లకు రిఫర్ చేయడం పరిపాటి. అక్కడ పరీక్షను బట్టి రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేల వరకూ వసూలు చేయడంతో పేద, మధ్య తరగతి వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి వారిని దృష్టిలో ఉంచుకుని, ఎటువంటి లాభాపేక్ష లేకుండా, నామమాత్ర రుసుముతో కాకినాడ నగరానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు డాక్టర్ బాదం బాలకృష్ణ స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో బాదం బాలకృష్ణ పేరుతో క్లినికల్ ల్యాబ్‌ను నెలకొల్పారు. కేవలం రూ.50 రుసుముతో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ వంటి ఓపీ సేవలు అందిస్తున్నారు. ల్యాబ్‌ను గతేడాది జూలైలో



ఎక్స్‌రే యంత్రం

ప్రారంభించగా, రోజుకు దాదాపు వంద నుంచి 200 మంది వైద్య సేవలు పొందుతున్నారు.

అందుబాటులో పరీక్షలివే..

సాధారణ బీపీ, షుగర్, ఎఫ్‌బీఎస్, డిజిటల్ ఎక్స్‌రే, థైరాయిడ్, లివర్, డెంగీ, ఈసీజీ, టిఫా, డప్లర్, 2డీ ఎకో, టీఎంటీ, ఈఎస్ఆర్, యూరిక్ యాసిడ్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, వీడీఆర్ఎల్, డెంగీ సెరాలజీ వంటి 30 రకాల వైద్య పరీక్షలు నామమాత్రపు రుసుముకే చేస్తున్నారు. నిపుణులైన, అర్హత ఉన్న సిబ్బందిని నియమించారు.

మార్కెట్ ధరలతో పోలిస్తే..

తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి మాత్రమే ఇక్కడ వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించారు. మార్కెట్ ధరలతో పోలిస్తే మూడోవంతు మాత్రమే వసూలు చేస్తున్నారు. ప్యాకేజీలుగా కూడా ల్యాబ్ పరీక్షలు చేస్తున్నారు. తద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగకరంగా ఉంది.

అన్ని హంగులతో ల్యాబ్‌లో సదుపాయాలు



ఆర్థిక స్తోమత లేని వారికి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ల్యాబ్ ఏర్పాటు చేశాం. రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని పలివెల సత్యరాజు మెమోరియల్ ట్రస్ట్ నుంచి ఇవ్వగా, పరికరాలు, ఇతర వాటికి దాదాపు రూ.2.50 కోట్లు ఖర్చయింది. నగరంలో పేరొందిన వ్యాపారులు, అలాగే సీపోర్టు యాజమాన్యం వంటి వారు ఎక్విప్‌మెంట్ సమకూర్చారు. కచ్చితమైన, నాణ్యమైన రిపోర్టుల కోసం నాణ్యత కలిగిన పరికరాలు ఏర్పాటుచేశాం. ఆర్థిక స్తోమత లేని వారికి ఇదెంతో ఉపయోగపడుతుంది. ఈ ట్రస్ట్‌కు సాయం చేసే వారికి ఐటీ ట్యాక్స్ మినహాయింపు సౌకర్యం లభిస్తుంది. ప్రతి పేదవారికి ఈ ల్యాబ్ ఉపయోగపడాలనేది నా ఆశయం.

– డాక్టర్ బాదం బాలకృష్ణ, చైర్మన్, క్లినికల్ ల్యాబ్

క్లీన్ సిటీగా కాకినాడ

- కార్పొరేషన్ కమిషనర్ భావన పిలుపు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ భావన

కాకినాడ: నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ భావన ప్రజలకు సూచించారు. పారిశుధ్య పర్యవేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక దేవాలయం వీధి, రాజాజీ వీధి ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాల్లో తడి-పొడి చెత్తను వేర్వేరుగా అందజేసి సహకరించాలని కోరారు. చెత్త సేకరణలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం ఎలియాజర్

కరప: వివిధ పంటల సాగులో పెట్టుబడులు తగ్గించి, నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని ఏపీసీఎన్ఎఫ్(ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్) డీపీఎం జె.ఎలియాజర్ అన్నారు. గురజనాపల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం కరప సబ్ డివిజన్ పరిధిలోని కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల వీఏఏలు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు, కలుపు మందులు వాడకుండా, ప్రకృతి సిద్ధంగా 9 సూత్రాలు అనుసరించి వ్యవసాయం చేయడంపై అవగాహన కల్పించారు. నేలను తేలికపాటి పనిముట్లతో తక్కువ లోతు దున్ని, రసాయనాలు వాడకుండా, బీజామృతం, ఘన, ద్రవ జీవామృతాలు వాడాలన్నారు. దేశీయ విత్తనాల వాడకం పెంచాలన్నారు. పశు సంపదను వ్యవసాయంలో అనుసంధానం చేయాలన్నారు. పురుగులు, తెగుళ్ల నివారణకు పసుపు పళ్లెంలు, లింగార్షక బుట్టలు వంటివి వినియోగించాలన్నారు. కృత్రిమ ఎరువులు వాడరాదన్నారు. ఆకు కూరలు, కాయగూరలను పండించడం ద్వారా ఏడాది పొడవునా ఆదాయం పొందవచ్చని చెప్పారు. పెద్దాపురం డీఆర్‌సీ ఏడీఏ పి.మాధవి మాట్లాడుతూ రైతుల సౌలభ్యం కోసం కొత్తగా క్రాప్ లైఫ్ సైన్స్, పెస్ట్ సర్వేలెన్స్ యాప్ వచ్చిందన్నారు. వివిధ పంటల్లో ఆశించే తెగుళ్లు, పురుగులు, పోషక లోపాలను గుర్తించి, వాటిని యాప్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో వివరించారు. ఈ యాప్ ద్వారా పొలంలో గుర్తించిన సమస్యను అక్కడికక్కడే పరిష్కారాన్ని రైతులకు తెలియజేస్తారన్నారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, కరప, కాజులూరు, తాళ్లరేవు ఎంఏఓలు ఏవీ రాజేష్, వి.అశోక్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణావతారంలో సీతారామస్వామి



కరప విష్ణ్వాలయంలోని వేణుగోపాల స్వామి



యండమూరులో వేంకటేశ్వరస్వామి

కరప: కృష్ణాష్టమి వేడుకలను స్థానిక విష్ణ్వాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రంలోని శ్రీరంగంలో చేసినట్టుగా ఇక్కడ కృష్ణాష్టమి వేడుకలు చేయడం పరిపాటి. ఆలయంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ పంచామృతాభిషేకం, ఇతర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అదే ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి వార్లకు అష్టోత్తర నామపూజ చేశారు. విష్ణ్వాలయంలో రాత్రి సమయంలో ఉట్టికొట్టి, భక్తులకు శ్రీకృష్ణునికి ఇష్టమైన అటుకులు, కాయం ప్రసాదాలను పంపిణీ చేశారు. దేవదాయ శాఖ ఈఓ కె.తిరుమల రవితేజ, గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలు గ్రామాల్లో తల్లిదండ్రులు తమ చిన్నారులను బాల గోపాలుడిగా, గోపికలుగా అలంకరించి వీధుల్లో సందడి చేశారు. పెనుగుదురు, కూరాడ, జెడ్.భావారం తదితర గ్రామాల్లోని విష్ణ్వాలయాల్లో కృష్ణాష్టమి పూజలు నిర్వహించారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని కృష్ణావతారంగా అలంకరించారు.

కృష్ణావతారంలో దర్శనం

బోట్‌క్లబ్: వైష్ణవ కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి మంగళవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, తులసి అర్చన చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అశోక్‌నగర్ గోకులంలో ఉదయం గోపూజ, పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జేఎన్‌టీయూకే ప్రగతిలో మోహన్‌ప్రసాద్ పాత్ర కీలకం



డీఈ మోహన్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు సన్నీ, నవీన్

- ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కళాశాల నుంచి వర్సిటీగా అప్‌గ్రేడ్ అయిన జేఎన్‌టీయూకేలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా(సివిల్) మోహన్‌ప్రసాద్ చేసిన సేవలు అభినందనీయమని ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ అన్నారు. రాజధాని అమరావతిలో సీఆర్‌డీఏకు డిప్యూటేషన్‌పై వెళ్తున్న ఆయనను మంగళవారం పలువురు అధికారులు అభినందించారు. వర్సిటీలో రూ.వందల కోట్లతో నిర్మించిన బిల్డింగ్ నిర్మాణంలో ఈయన పాత్ర కీలకమని, ప్రస్తుతం జరుగుతున్న రోడ్లు, స్నాతకోత్సవ భవనం, పీజీ హాస్టల్ భవన నిర్మాణం తుది దశలో ఉన్న నేపథ్యంలో బదిలీపై వెళ్లడం వర్సిటీకి లోటేనన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, ఇంజినీరింగ్ అధికారులు సన్నీ, బి.నవీన్, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

వికసిత్ ఏపీ దిశగా అడుగులు

- మెప్మా పీడీ ప్రియంవద



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ప్రియంవద

కాకినాడ: వికసిత్ ఏపీ-2047ను లక్ష్యసాధన దిశగా క్షేత్ర స్థాయిలో సిబ్బంది పని చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మెప్మా సిబ్బందితో ఈ అంశంపై ఆమె సమావేశమయ్యారు. వికసిత్ ఏపీ-2047 ప్రణాళికపై సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో ప్రతిపాదించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ, ఆయా పథకాల అమలుపై సూచనలు ఇచ్చారు. సైబర్ నేరాలు, వాటి నుంచి బయటపడే మార్గాలపై పోలీసు విభాగాల ప్రతినిధి శ్రీకృష్ణ వివరించారు. ఆయా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నిరసన



వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కాకినాడ రూరల్: అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక రమణయ్యపేటలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వద్ద ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసనకు దిగారు. 2.0 రీఆర్గనైజేషన్ పేరుతో జరిగిన అన్యాయాలపై, జీఎస్టీవోలకు సరైన వర్క్ ఫంక్షన్ ఏర్పాటు చేయాలని, పూర్వపు బదిలీలన్నీ పునః సమీక్షించాలని, సర్కిల్ వ్యవస్థను పూర్వపు స్థితికి తిరిగి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఆర్‌వో ఆఫీసులను రద్దు చేయాలన్నారు. ఈ విషయాన్ని కూడా సానుకూలంగా పరిష్కరించాలని, తర్వాత మాత్రమే ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీడీ సర్వీస్ అసోసియేషన్ కాకినాడ డివిజన్ ప్రెసిడెంట్ పి.వి జయ్‌కుమార్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అనిశెట్టి వీవీఎస్ స్వామి పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

సామర్లకోట: ప్రయాణ సమయాల్లో రైల్వే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్ రామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజులు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక రైల్వే ప్లాట్‌ఫారంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని చెప్పారు. నేరగాళ్లను దృష్టిలో ఉంచుకుని బ్యాగ్‌లు, వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ప్రయాణికుల వద్దకు వచ్చి రూపాయి నోట్లు పడిపోయాయని చూపించి, ప్రయాణికులు ఆ నోటును తీసుకునే లోగా బ్యాగ్‌లను మాయం చేస్తున్నారని హెచ్చరించారు. అదేవిధంగా అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండరాలను తీసుకోరాదని సూచించారు. విలువైన నగలు వెంట తీసుకు వెళ్లే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తోటి ప్రయాణికులపై ఏ మాత్రం అనుమానం ఉన్నా 100కు కాల్ చేయాలని కోరారు.



సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫారంపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్సైలు

సంస్కార భారతి కృషి అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న గొట్టుముక్కుల

బోట్‌క్లబ్: లలిత కళల అభివృద్ధికి సంస్కార భారతి చేస్తున్న కృషి అభినందనీయమని ఏపీ సంస్కార భారతి ఉపాధ్యక్షురాలు వేదన భట్ల సాయిలక్ష్మి అన్నారు. స్థానిక ద్వారకనగర్‌లోని సరస్వతి విద్యాలయ వేదిక కార్యాలయంలో మంగళవారం సంస్కార భారతి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఆస్వాదన సాహిత్య సంస్థ వ్యవస్థాపకుడు గొట్టుముక్కుల వెంకటసత్య నరసింహశాస్త్రి మాట్లాడుతూ భగవద్గీత ద్వారా మానవ కోటికి భగవంతుడైన కృష్ణను వివరించారన్నారు. ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, సంగీత విద్వాంసుడు విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి, సుజాతను సత్కరించారు. అనంతరం దేశభక్తి గీతాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పంచాంగ కర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, సంస్థ జిల్లా అధ్యక్షుడు వింజరపు జనార్దనం తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలి



కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన వీఆర్వోలు

- ఏపీ వీఆర్వోల సంఘం డిమాండ్

కాకినాడ సిటీ: గ్రేడ్-1 వీఆర్వోలను సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో 47 మందికి 17 మంది వివిధ కారణాల రీత్యా సంబంధిత శాఖ పరీక్షలు రాయలేకపోయారని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. నాలుగేళ్ల క్రితమే గ్రేడ్ వన్ వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాల్సి ఉందన్నారు. ఈ పదోన్నతుల్లో కొన్ని నిబంధనలతో రాష్ట్రంలో 650 మందికి గాను దాదాపు 450 మంది శాఖ, ఇతర పరీక్షలలో ఉత్తీర్ణత అయ్యారన్నారు. వీరిలో కొంత మందికి పరీక్షలు గతంలో సకాలంలో నిర్వహించకపోవడం, అలాగే ఏపీపీఎస్సీ వారిచ్చిన సీపీటీ పరీక్షల ప్రకటనలో గ్రేడ్ వన్ వీఆర్వోలకు మాత్రమే ప్రమోషన్లు ఇచ్చారన్నారు. ప్రభుత్వం సర్వే ఎగ్జామ్స్ నిర్వహించకపోవడం, సీపీటీ టెస్ట్ పాస్ కాని వారికి, 45 ఏళ్లు దాటిన వారికి టెస్టుల్లో మినహాయింపు ఇచ్చి పదోన్నతులు కల్పించవచ్చని జీవోలో స్పష్టంగా ఉందన్నారు. అర్హులైన వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని రవీంద్రరాజు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అనిశెట్టి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఏఎస్వీ తమ్మారావు, ఎం కిషోర్, పీవీ తాతారావు తదితరులు పాల్గొన్నారు.